Namasthe Telangana Dt 01/12/17.

# నిఘా పటిష్ఠం.. ప్రయాణం భద్రం

**మెట్రో భద్రతకు ఆధునిక టెక్నాలజీ.. ఒక్కో స్టేషన్‌లో 65 సీసీ కెమెరాలతో నిఘా**

**రక్షణ విధుల్లో 2,100 మంది సిబ్బంది.. ప్రజలు సహకరిస్తే సౌకర్యవంతమైన ప్రయాణం**

**డీజీపీ మహేందర్‌రెడ్డి.. అమీర్‌పేట మెట్రోరైలు స్టేషన్ పరిశీలన**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

మెట్రోకు పూర్తి భద్రత కల్పిస్తున్నామని.. ప్రజలు నిశ్చింతగా ప్రయాణం చేయవచ్చునని డీజీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఒక్కో మెట్రోస్టేషన్లో సుమారు 65 సీసీ కెమెరాలు ఉన్నాయని, ఒక్కో కెమెరా వందమంది పోలీసులతో సమానమని చెప్పారు. వీటికి అదనంగా మెటల్ డిటెక్టర్లు, స్కానర్లు వంటి అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేశారన్నారు. చీమ చిటుక్కుమన్నా తెలిసిపోయేలా ఏర్పాట్లు ఉన్నాయన్నారు. తాము ఎన్ని ఏర్పాట్లు చేసినా ప్రజల సహకారం ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని కోరారు. గురువారం సాయంత్రం ఆయన అమీర్‌పేట మెట్రో స్టేషన్‌ను సందర్శించారు. అక్కడి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఎల్ అండ్ టీ, హైదరాబాద్ మెట్రోరైలు అధికారులతో సమావేశమయ్యారు. ఆ తర్వాత మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ఎల్ అండ్ టీ ఎండీ శివానంద్ నింబార్గితో కలిసి మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌కు తలమానికమైన మెట్రోరైలును ప్రధాని మోదీ ప్రారంభించడం సంతోషంగా ఉన్నదన్నారు. భవిష్యత్తులో మెట్రో సేవలు 24 గంటలపాటు అందుబాటులోకి రావాలని అభిలాషించారు. కుటుంబ సభ్యులంతా సులభంగా, సౌకర్యవంతంగా మెట్రో రైలులో ప్రయాణించేలా ఏర్పాట్లు ఉన్నాయన్నారు.

**2,100 మందితో భద్రత**

స్టేషన్ లోపల, ఆవరణలో, పరిసరాల్లో, ట్రాక్‌పై.. ఇలా అన్నిచోట్ల సీసీ కెమెరాల నిఘా ఉంటుందన్నారు. అన్ని కెమెరాలను ఉప్పల్ మెట్రో డిపోలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేశారన్నారు. అక్కడి నుంచి ప్రతి కదలికను పరిశీలిస్తున్నామన్నారు. ఉప్పల్‌లోని మెట్రో కమాండ్ సెంటర్‌ను బంజారాహిల్స్‌లో నిర్మిస్తున్న పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంతో అనుసంధానిస్తామని చెప్పారు. దీంతో పోలీసులు కూడా అన్ని స్టేషన్లను పరిశీలించే అవకాశం కలుగుతుందన్నారు. మెట్రో కోసం ప్రత్యేకంగా రెండు పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. మెట్రో భద్రత కోసం మూడు కమిషనరేట్ల సీపీలు, డీసీపీలు, ఏసీపీలు, ఎస్‌హెచ్‌వోలు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. భద్రత, సర్వీస్ విషయంలో హైదరాబాద్ మెట్రో రైలును దేశంలోనే ఉత్తమంగా నిలబెడుతామన్నారు. ప్రస్తుతం భద్రత కోసం 2,100 మంది సేవలను వినియోగిస్తున్నామని, ఇందులో 600 మంది పోలీసులు ఉన్నారని చెప్పారు.

**ఉన్నత ప్రమాణాలు పాటించాం**

భద్రత విషయంలో ఉన్నత ప్రమాణాలు పాటించామని ఎల్ అండ్ టీ ఎండీ శివానంద్ నింబార్గి చెప్పారు. ప్రయాణికుల నుంచి మంచి స్పందన వస్తున్నదంటూ.. అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీజీపీ అంజనీకుమార్, ఇంటెలిజెన్స్ ఐజీ నవీన్‌చంద్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీవీ శ్రీనివాసరావు, డీసీపీలు వెంకటేశ్వర్‌రావు, సుమతి పాల్గొన్నారు.



అమీర్‌పేట రైల్వేస్టేషన్‌లో మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో భద్రతపై చర్చిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి. చిత్రంలో ఎల్ అండ్ టీ ఎండీ శివానంద్ నింబార్గి తదితరులు

## త్వరలో కంప్యూటరైజ్డ్ పార్కింగ్‌లు

త్వరలో అన్ని స్టేషన్లలో కంప్యూటరైజ్డ్ పార్కింగ్ సదుపాయం కల్పిస్తామని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. ఈ మేరకు స్టేషన్ల సమీపంలోని స్థలాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. సొంత స్థలం ఉన్న ప్రైవేట్ వ్యక్తులు పార్కింగ్ ఏర్పాటుకు ముందుకు వస్తే అనుమతిస్తామని తెలిపారు స్థలం ఇచ్చినా నిబంధనల ప్రకారం తీసుకుంటామన్నారు. ప్రయాణికుల భద్రత కోసం అంతర్జాతీయ స్థాయిలో అధ్యయనం చేశామన్నారు. మాజీ పోలీస్ ఉన్నతాధికారులు కేసీ రెడ్డి, హెచ్‌జే దొర సహాయం తీసుకున్నామన్నారు. సేఫ్టీపై తీసుకున్న నిర్ణయాలను కేంద్ర హోం శాఖకు నివేదించామన్నారు. అక్కడి నుంచి వచ్చిన సూచనల ఆధారంగా ఎల్ అండ్ టీ, పోలీసుల సమన్వయంతో ఏర్పాట్లు చేశామన్నారు. అన్ని స్టేషన్లలోని సీసీ కెమెరాల పుటేజీని నిల్వ చేస్తున్నామన్నారు. ఇప్పటికే మియాపూర్, ఎర్రగడ్డ, ఈఎస్ఐ, నాగోల్, ఉప్పల్‌లో మందుబాబులు సీసీ కెమెరాల కంటికి చిక్కారన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.